క్లుప్తంగా

పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న కార్పొరేటర్ సాంబశివరావు

ఏలూరు (టూటౌన్): టేక్ హోమ్ రేషన్ పథకంలో భాగంగా స్థానిక గ్లేవియర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం–4లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ కలువకొల్లు సాంబశివరావు మాట్లాడుతూ మాతా శిశు మరణాలు, మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత తగ్గించేందుకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని ఇంటికే అందిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నరసింహారావుపేట డాక్టర్ అమర్ కోటేశ్వర్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ బి.మంగ, మహిళా పోలీస్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీలు, ఆశలు పాల్గొన్నారు.

18 నుంచి శ్రావణ మాస మహోత్సవాలు



శ్రావణ మాస మహోత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయంలో ఈ నెల 18 నుంచి శ్రావణ మాస మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు వారణాశి శ్రీ రాఘవేంద్ర శర్మ తెలిపారు. శ్రావణ మాసమహోత్సవాల కరపత్రాన్ని శుక్రవారం ఆలయంలో విడుదల చేశారు. అమ్మవారికి నిత్యం శ్రీచక్ర కుంకుమ పూజలు, సర్వ కైంకర్య పూజలు, శుక్ర, మగళ వారాల్లో ప్రత్యేక అలంకరణలు, వరలక్ష్మి, మంగళగౌరి వ్రతాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అమ్మవారికి తొలి రోజు ఆదిలక్ష్మి, 22న ధాన్యలక్ష్మి, 25న ధైర్యలక్ష్మి, 29న గజలక్ష్మి, వచ్చే నెల 1న సంతానలక్ష్మి, 5 విజయలక్ష్మి, 8న విద్యాలక్ష్మి, 12న ధనలక్ష్మి అలంకరణలు చేస్తామన్నారు. సెప్టెంబర్ 4న ఆలయ వార్షికోత్సవ శిఖర కుంభాభిషేకం, మహాలక్ష్మి మూలమంత్ర హోమం, భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. 10న అమ్మవారి అన్నపూర్ణ భవనం ప్రారంభోత్సవం, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీ సౌభాలక్ష్మీదేవి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే ఆళ్ల నాని



బీడీ కాలనీలో పథకాలను వివస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శవంతమైన రీతిలో అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని, విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. 108వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏలూరు 28వ డివిజన్ బీడీ కాలనీలో నిర్వహించారు. నాని పాదయాత్రగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందుతోన్న తీరుపై మహిళలు, వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ విద్యా రంగాన్ని గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించారని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు, నేడు పథకంలో కార్పొరేట్‌కు ధీటుగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. విద్యార్థులను పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యకానుక, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివాటితో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. వైద్యరంగంలోనూ సమూల మార్పులు చేస్తూ పేదవానికి గడపకే వైద్యులను తీసుకొస్తున్నారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్, అర్బన్ హెల్త్ సెంటర్లు, 104 సంచార వైద్యశాల వంటి వాటితో ప్రజలకు వైద్యసేవలు చేరువచేశారని చెప్పారు. తొలుత చేనేత విభాగం అధ్యక్షుడు కొలిపాక సురేష్, గత కార్పొరేటర్ అభ్యర్థి కొలికిపాము తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, పొలిమేర దాసు, సుంకర చంద్రశేఖర్, యర్రంశెట్టి సుమన్, గరికిముక్కు జయకర్, కర్రి శ్రీనివాస్, తంగెళ్ల రాము, యర్రంశెట్టి నాగబాబు, దేవరకొండ శ్రీనివాస్, బత్తిన విజయకుమార్, గుడిపూడి శ్రీనివాస్, కవలకొల్లు సాంబ, పాషా, వాణిజ్య విభాగం మోటమర్రి సదానందం, నున్న కిషోర్, పొలిమేర హరికృష్ణ, సేవాదళ్ యల్లాపు మోజెస్, వైఎస్‌వీ శివరావు, బండ్లమూడి సునీల్, తోటకూర కిషోర్, లూటుకుర్తి సుభాష్, మట్టా రాజు, ప్రత్తిపాటి తంబి, పిట్టా ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 166 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్ఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. సెమిస్టర్ పరీక్షలకు 151 మందికి 147 మంది, సప్లిమెంటరీ పరీక్షకు 71 మందికి 19 మంది విద్యార్థులు హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అశోక్ నగర్ సబ్ స్టేషన్ కొత్తపేట ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ తెలిపారు. గుబ్బల వారి వీధి, రాఘవాచారి వీధి, మాగంటి వారి వీధి, బెండువారి వీధి, శంకర మఠం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల నడవడికపై దృష్టి పెట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల నడవడిక, మానసిక స్థితిపై దృష్టి సారించాలని అధ్యాపకులు, ఇతర సిబ్బందికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఆమె శుక్రవారం ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ర్యాగింగ్ కమిటీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ర్యాగింగ్ గురైన విద్యార్థుల పేరును గోప్యంగా ఉంచుతారని, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.బాలకష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కాలేజీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రమశిక్షణలో ఉండేలాగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాంటీ ర్యాగింగ్ కమిటీ మెంబర్స్ కూన కష్టారావు, సీహెచ్ వంశీకృష్ణ, ఎల్ వెంకటేశ్వరరావు, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో మతపరమైన దాడులు



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు, బాలికలు

ఏలూరు (టూటౌన్) : బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా మతపరమైన దాడులు పెరిగాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. సేవ్ ఇండియా.. సేవ్ మణిపూర్‌లో భాగంగా ఐద్వా, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో శుక్రవారం సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల నుంచి భారీ ర్యాలీ, స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, సీఎం బీరన్ సింగ్‌లు చేసిన ప్రకటనలు దోషులను సమర్థించేలా ఉన్నాయని ఆరోపించారు. తక్షణం మణిపూర్ సీఎంను భర్తరఫ్ చేయాలన్నారు. మోదీ పాలనలో దళిత, గిరిజనులు, ముస్లింలు, క్రైస్తవులపై దాడులు పెరిగాయని వివరించారు. బీజేపీ లౌకిక రాజ్యాంగం స్థానంలో మత రాజ్యాంగాన్ని తీసుకురావాలని భావిస్తుందని అన్నారు. మోదీ ముఖ్యమంత్రిగా ఉండగా గుజరాత్‌లో ముస్లింలపై దాడులు మొదలుకొని నేడు మణిపూర్‌లో క్రైస్తవులపై దాడుల వరకు బీజేపీ ప్రభుత్వం అండతో ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల ప్రమేయం ఉందని చెప్పారు. మణిపూర్‌లో వేలకొలది ప్రజల నివాసాలు, 250కి పైగా చర్చిలు ధ్వంసం చేశారని వివరించారు. ప్రస్తుతం హర్యానాలో కూడా మతోన్మాదులు దాడులకు తెగబడుతున్నారని వాపోయారు. భారత రిఫార్మ్స్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జి.శారద, పి.వెంకటరమణ, జె.హరీషా దుర్గ, షేక్ సైదాని, మంచెల వెంకటలక్ష్మి, టి.రజని, పి.విజయలక్ష్మి, కె.విజయలక్ష్మి, మంచెల్ల ఇస్సాక్, బి.జగన్నాథరావు, వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్) : కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పొగాకు పనివార్ల సంఘం సర్వసభ్య సమావేశం జోగి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ లౌకిక వ్యవస్థను కాపాడుకోవాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 15న ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తామన్నారు. ఏఐటీయూసీ నాయకులు పుప్పాల కన్నబాబు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, కార్యదర్శి పుప్పాల శ్రీనివాస్, కోశాధికారి చింతపల్లి కూర్మారావు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారునిగా బండి వెంకటేశ్వరరావు, గొళ్ల నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా రెడ్డి శ్రీనివాస డాంగే, అధ్యక్షుడిగా జోగి నాగేశ్వరరావు, కార్యదర్శిగా పుప్పాల శ్రీనివాసరావు, కోశాధికారిగా చింతపల్లి కూర్మారావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కార్యదర్శిగా పనిచేసిన బండి వెంకటేశ్వరరావు, గొళ్ల నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.

కొల్లేరులో జగనన్న కాలనీల అభివృద్ధి



మొండికోడులో మెరక చేసిన ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

ఏలూరు రూరల్: కొద్దిరోజుల్లో కొల్లేరు జగనన్నకాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఏలూరు మండలం కోటేశ్వరదుర్గాపురం, గుడివాకలంక, చాటపర్రు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొల్లేరు గ్రామాల్లో పేదలు లోతట్టున గుడిసెలు వేసుకుని బిక్కుబిక్కుమంటూ జీవించేవారన్నారు. చిన్నపాటి వర్షానికి, వరదకు ముంపుబారిన పడి నానా అగచాట్లు పడ్డారని గుర్తుచేశారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొల్లేరు ప్రజలు ముంపుబారిన పడకుండా జగనన్నకాలనీలు ఏర్పాటుచేస్తున్నారని కొనియాడారు. పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, మొండికోడు, శ్రీపర్రు, చాటపర్రు, జాలిపూడి, మాదేపల్లి, మానూరులో జగనన్నకాలనీలను సుమారు రూ.15 కోట్లు ఖర్చు చేయించి మెరక చేశారని చెప్పారు.

మెరుగైన వైద్య సేవలు

పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని శ్రీనివాసరాజు అన్నారు. చైర్మన్ హోదాలో ఆయన ఉదయం 12 గంటలకు గుడివాకలంక, చాటపర్రు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో కలిసి పాలక మండలి సమావేశం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. చాటపర్రు పీహెచ్‌సీకి వాచ్‌మెన్ నియమించాలన్నారు. వైద్యులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవుతాం

కోటేశ్వరదుర్గాపురంలో సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ అధ్యక్షతన నా భూమి, నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ శ్రీనివాసరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వై సుజాత, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కిషోర్, వైఎస్సార్‌సీపీ బాలకృష్ణ, పెద్దలు దేశాభివృద్ధిలో భాగస్వాములమౌతామని ప్రతిజ్ఞ చేసి, అమరవీరులకు నివాళులర్పించారు. మొక్కలు నాటారు. అనంతరం ఎంపీపీ స్థానిక అంగన్‌వాడీ సెంటర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. పిల్లల విద్యాబుద్ధులు, పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	64	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-07
బెండకాయలు	32	కంద	40
పచ్చిమిర్చి	66	బీట్‌రూట్	36
కాకర కాయలు	64	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	50	అల్లం	140-240
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	17
క్యారెట్	36	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30 - 34	బఠాణి	--
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	16

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు -బీహెచ్ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	36
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	19

క్రీడాకారులకు స్పోర్ట్స్‌వేర్ పంపిణీ



బాలబాలికలకు స్పోర్ట్స్‌వేర్ అందిస్తున్న దాతలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాలబాలికలు జాతి సంపద, వారికి మెరుగైన వసతులు, అవకాశాలు కల్పించాలని బాల వికాస్ ఫౌండర్ కట్టా సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఈదర సుబ్బమ్మదేవి మునిసిపల్ స్కూల్, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాలబాలికలు స్పోర్ట్స్‌వేర్, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వాసవి సుబ్బారావు, సీతారాజ్యలక్ష్మి ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సుబ్బారావు, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, కడియం ప్రసాద్, రత్నా పెయింట్స్ అధినేత వి.రత్నకుమార్, స్కూల్ హెచ్ఎం పి.కుటుంబరావు, జీఎంవీర్ కృష్ణారావు, తుంపాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌పై అవగాహన



మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): శాశ్వత లోక్ అదాలత్, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యకలాపాలపై ప్యానల్ లాయర్లకు, వాలంటీర్లకు, అడ్వకేట్ గుమస్తాలకు శుక్రవారం సాయంత్రం అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవా సదన్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ రవాణా, పోస్టల్, టెలికం, విద్య, వైద్యం, నీటి సరఫరాల, రియల్ ఎస్టేట్, ఆసుపత్రుల సేవలు, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలపై లోపం సంభవిస్తే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ సెప్టెంబరు 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

జగన్ పాలనలో సొంతింటి కల సాకారం



మహిళలకు ఇంటి పట్టా అందిస్తున్న రామకృష్ణ, తేజ

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమౌతోందని ఏఎంసీ వైస్‌చైర్మన్ కంచన రామకృష్ణ అన్నారు. శుక్రవారం పోణంగిలో పేదలకు ఇళ్ల స్థల పట్టాలు, రేషన్‌కార్డులు పంపిణీ చేవారు. కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని నగరంలో 30 వేలకు పైగా పేదలకు ఇళ్ల స్థలాలు అందించడం చరిత్రలో మరచిపోలేమని చెప్పారు. పోణంగి జగనన్నకాలనీలో లబ్ధిదారులు పెద్ద ఎత్తున ఇళ్లు కట్టుకోవడంతో రానున్న రోజుల్లో టౌన్‌షిప్‌గా మారనుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆళ్లనాని మరోసారి విజయం సాధించాలనా ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నేత దారపు తేజ మాట్లాడుతూ ఆళ్ల నాని సారథ్యంలో 14వ డివిజన్‌లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

20 వేల మొక్కల పంపిణీ

దెందులూరు: జిల్లాలో 12 రకాల మొక్కలు 20 వేలు పంపిణీ చేశామని లయన్స్‌క్లబ్ జిల్లా సెక్రటరీ చుక్కా అవినాష్ రాజు అన్నారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ మామిడి, సపోటా, జామ, నేరేడు, కొబ్బరి, అరటి, సీతాఫలం, నిమ్మలతో పాటు పలు రకాల మొక్కలను జిల్లాలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామాల రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేయడానికి లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఏజెన్సీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరి సహాయ సహకారాలతో పంపిణీ చేశామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన ముడిపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. మొక్కలు నాటిన ప్రతి ఒక్కరూ వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లాను గ్రీన్ జిల్లాగా మార్చేందుకు లయన్స్ క్లబ్ ప్రణాళికాబద్ధంగా మొక్కలు పంపిణీ, రక్షణ , ఏర్పాటు కార్యక్రమం చేస్తుందన్నారు.

డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది ఉత్సవాలకు వేదిక తయారయ్యింది. శని, ఆదివారాలు రెండురోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ఉన్నత విద్యశాఖ కమిషనర్ పోలాభాస్కర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలు ప్రారంభిస్తారు. అనంతరం పైలాన్‌ను, అరవిందుడు, గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కోస్తా జిల్లాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొంటారు. పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి అప్పారావు, ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు ఆధ్వర్యం వహించనున్నారు. నారాయణపురంలో విద్యాదాత చింతలపాటి మూర్తిరాజు 1972లో ఈ కళాశాలను ఏర్పాటు చేశారు. ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికార్లు, పూర్వ విద్యార్థులు పాల్గొంటారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

దెందులూరు: మండలంలో అన్ని పాఠశాలల్లో నాడు-నేడు మన బడి పనులు ఈ నెల 31లోపు విధిగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ అన్నమ్మ అధ్యక్షతన అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు తొలిప్రాధాన్యతిస్తోందని, ప్రాధాన్యతను గుర్తించి హెచ్‌ఎంలు లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలన్నారు. రోజువారీ ప్రగతిని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు.

ఎస్టీ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ కేటాయింపుపై హర్షం

దెందులూరు: ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ కుంబా రవిబాబు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చినందుకు గాలాయగూడెం బీఎస్ఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో బీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బండి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, ఎస్టీ సామాజిక వర్గ ప్రతినిధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనులను ఆర్థికంగా, సామాజికంగా గుర్తిస్తూ, గౌరవిస్తూ ప్రోత్సహిస్తున్నారని ట్రెజరర్ కందుల రాజు హర్షం వ్యక్తం చేశారు.